క్లుప్తంగా

నేడు కొత్త కోడూరులో గంగమ్మ జాతర


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ మూలవిరాట్

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణ పరిధిలోని కొత్తకోడూరులో గురువారం గంగమ్మ జాతర నిర్వహించనున్నారు. జాతర కమిటీ వారు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం తెల్లవారు జామున గంగమ్మను ఊరేగింపుగా గంగమ్మ మిట్టకు తీసుకు రానున్నారు. అలాగే శుక్రవారం జల్ది ఉత్సవం నిర్వహించనున్నారు.

ఘనంగా జాంబవంతుడికి పూజలు


ప్రత్యేక అలంకారంలో జాంబవంతుడు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని అంకమ్మ నగర్‌లో వెలసి ఉన్న జాంబవంతుడి ఆలయంలో బుధవారం స్థానికుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు జాంబవంతుడికి అభిషేకాలు చేశారు. అనంతరం మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేశారు. నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వేసవి శిబిరాలు వినియోగించుకోవాలి


విశ్రాంత గ్రంథాలయ అధికారిని సన్మానిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు అర్బన్: గ్రంథాలయ వేసవి శిబిరాలను ప్రతి విద్యార్థి వినియోగించుకోవాలని విశ్రాంత గ్రంథాలయ అధికారి రంగనాథ్ పేర్కొన్నారు. బుధవారం విద్యార్థులకు వివిధ దేశాల నాణేలను, కరెన్సీని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయ వేసవి శిబిరాలను వినియోగించుకొని ఉన్నత శిఖరాలకు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి


ఉపాధికూలీలతో మాట్లాడుతున్న రామాంజులు

సంబేపల్లె : ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి రామాంజులు కోరారు. మండల పరిధిలోని గుట్టపల్లె పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. వేసవిలో నీరు, మజ్జిగ ఇవ్వాలన్నారు. కూలీల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన కోరారు.

నేడు మార్కెట్ యార్డు పాలక మండలి సభ్యుల సమావేశం

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లె వ్యవసాయ మార్కెట్‌లో వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుల సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు మార్కెట్ యార్డు చైర్మన్ విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో పాలకమండలి సభ్యులతో మూడు నెలలుగా వ్యవసాయ మార్కెట్‌లోని లావాదేవీలు, లైసెన్సులు, రెన్యువల్, మార్కెట్ యార్డు చుట్టూ రూ. 32 లక్షలతో ప్రహరీ నిర్మాణం తదితర అంశాలపై చర్చిస్తారన్నారు. పాలకమండలి సభ్యులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన రేషన్ బియ్యాన్ని ఒంటిమిట్ట గోడౌన్‌కు తరలించిన దృశ్యం

ఒంటిమిట్ట : మండల పరిధిలోని కొత్తమాధవరం గ్రామం జాంబవంతుని వీధిలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా.. సిద్దవటం మండలానికి చెందిన నాగమునిరెడ్డి అలియాస్ బుజ్జిరెడ్డి కొత్తమాధవరం గ్రామం జాంబవంతుని వీధిలోని ఓ ఇంటిలో 134 బస్తాల రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచారు. ఈ సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు దాడి నిర్వహించి 6,250 కిలోల బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ బస్తాలను ఒంటిమిట్టలో ఉన్న ప్రభుత్వ రేషన్ బియ్యం గోడౌన్‌కు తరలించినట్లు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

- మండల సమావేశంలో ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మీదేవి

లక్కిరెడ్డిపల్లి: ప్రజా సమస్యల పరిష్కార దిశగా అధికారులు చొరవ చూపాలని ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, జెడ్పీటీసీ అంబాబత్తిన లక్ష్మీదేవి పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లె ఎంపీడీఓ సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ, జెడ్పీటీసీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శాఖలవారిగా అధికారులతో సమీక్ష చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాలలో పనులు చేసిన కూలీలకు బిల్లులు చెల్లించకుండా అధికారులు జేబులు నింపుకుంటున్నారని ప్రజా ప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వారు మాట్లాడుతూ కూలీలకు అన్యాయం చేస్తే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి అధికారులపై చర్యలకు డిమాండ్ చేస్తామన్నారు. రైతులు మట్టి తోలుకునేందుకు అవకాశం కల్పించాలని, చెక్ డ్యామ్‌లకు మరమ్మతులు చేసే పనుల ద్వారా రైతులకు, ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు.


మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. అర్హులైన వారికి పక్కా గృహాల మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. చాగలగట్టపల్లెలోని దారి సమస్యకు పరిష్కారం చూపాలని సర్పంచ్ శిద్దక నాగిరెడ్డి తహసీల్దార్ ఉదయ శంకర్ రాజు దృష్టికి తీసుకొచ్చారు.ఎగువ, దిగువ బూడిదగుంటపల్లెల్లో స్మశాన వాటిక కావాలని సర్పంచ్ సంధ్యారాణి సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఉదయ శంకర్ రాజు, ఎంపీడీఓ వెంటరామిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు సమరసింహారెడ్డి, నాగలక్ష్మీ, కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అమీర్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారులు ఏమన్నారంటే..

- వ్యవసాయ అధికారి కిషోర్ నాయక్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలలో ఎరువుల తోపాటు పురుగు మందులు కూడా రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. ఈనెల 18వ తేదీలోపు రైతు భరోసా కోసం గ్రామ సచివాలయాలలో నమోదు చేసుకోవాలన్నారు.
- జేజేఎం ద్వారా జగనన్న కాలనీలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు బోర్లు వేస్తున్నామని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కిషోర్ తెలిపారు.
- జగనన్న కాలనీలలో పక్కా గృహాలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సర్వీసులతో పాటు వీధి దీపాలను అమర్చుతున్నామని ట్రాన్స్‌కో ఏఈ కృష్ణయ్య తెలిపారు.
- అమూల్ ద్వారా పాడి రైతులు వద్ద పాలసేకరణ చేయడానికి మండలానికి ఏడు అమూల్ సెంటర్లు మంజూరయ్యాయని ఏపీఎం నిరంజన్ తెలిపారు.

వెలిగల్లు నీటిసరఫరాలో ఎలాంటి అంతరాయం లేదు


మాట్లాడుతున్న గంగాప్రసాద్

రాయచోటి అర్బన్ : వెలిగల్లు వాటర్‌స్కీం ద్వారా రాయచోటికి నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 8వతేదీన వీచిన ఈదురుగాలులు, మెరుపుల కారణంగా వెలిగల్లు ప్రాజెక్టులోని ఇంటెక్‌వెల్‌కు చెందిన ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి నీటిసరఫరాకు ఇబ్బంది ఏర్పడిందన్నారు. ట్రాన్స్‌కో ద్వారా మరమ్మతులకు నెలరోజుల సమయం పడుతుందని తెలియడంతో ప్రైవేటు ఎలక్ట్రికల్ సంస్థల ద్వారా అద్దె ప్రాతిపదికన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించామన్నారు. 48 గంటల్లోనే నీటి సరఫరాకు ఉన్న అంతరాయాన్ని తొలగించినట్లు తెలిపారు. ఈనెల 10వ తేదీ నుంచే పట్టణానికి తాగునీటి సరఫరా జరుగుతోందన్నారు.

దేశ భౌగోళిక పరిస్థితులపై అవగాహన తప్పనిసరి

రాయచోటి అర్బన్ : ప్రతి విద్యార్థికి దేశ భౌగోళిక పరిస్థితులపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని జనవిజ్ఞానవేదిక సభ్యుడు, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు శంకరయ్య అన్నారు. జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో వారం రోజులుగా కొనసాగుతున్న వేసవి వినోదం కార్యక్రమం ముగింపు సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్‌పోటీల విజేతలకు అతిథులు బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తప్పని సరిగా దేశంలోని రాష్ట్రాలు, వాటి రాజధానులు, నదులు, పర్వతాలు, ఎడారులు, సముద్రాలు తదితర అంశాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. తెలుగుపండితుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ భారతం, రామాయణం కావ్యాల్లోని నీతిని వివరించారు. హెడ్మాస్టర్ శివయ్య మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచనా దృక్పథాన్ని పెంపొందించేందుకు జేవీవీ చేస్తున్న కృషిని కొనియాడారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు ఆంజనేయులు, రామయ్య, శివారెడ్డి, రవీంద్రనాథరెడ్డి, కళావతి, ప్రతాప్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, బయారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు శంకరయ్య

జగనన్న గృహ నిర్మాణాల లబ్ధిదారులతో ముఖాముఖి

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం జగనన్న గృహ నిర్మాణాల లబ్ధిదారులతో మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి ముఖాముఖి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల్లో జగనన్న పక్కాగృహాలను నిర్మించుకోవాలని లబ్ధిదారులకు ఆయన సూచించారు. గృహ నిర్మాణాల పనులు వేగవంతంగా చేపట్టాలన్నారు. సర్పంచ్ జానకిరామయ్య, తహసీల్దారు శంకర్‌రావు, హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ చెన్నయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మానస, వీఆర్‌వోలు గౌస్‌పీర్, రజని, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మీనరసయ్య, సుజాత, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


లబ్ధిదారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ

లక్కిరెడ్డిపల్లి: లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో లయన్ అశోక్ రెడ్డి, షేక్ మహమ్మద్, లయన్ శ్యామసుందర్ రెడ్డి, రెడ్డి కీర్తిరెడ్డిల ఆర్థిక సౌజన్యంతో లక్కిరెడ్డిపల్లె మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం టీబీ యూనిట్ రోగులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు లయన్ షేక్ మహమ్మద్ మాట్లాడుతూ 12 మంది టీబీ రోగులకు పౌష్టికాహారం అందజేశామన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సేవలను స్ఫూర్తిగా తీసుకుని తమ వంతు ప్రజలకు సేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు లయన్ వి.హరీష్ చంద్ర, రాజశేఖర్ రాజు, గురు శంకర్ రెడ్డి, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలోఫర్ బేగం, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ జీవన్, డాక్టర్ ధరణి కుమార్, డాక్టర్ భారత్, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ హరి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


టీబీ రోగులకు పౌష్టికాహారం అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

గంగమ్మతల్లీ...దీవించమ్మా..

తంబళ్లపల్లె : కోటకొండ గంగమ్మ తల్లీ దీవించమ్మా.. రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా, ప్రజలు సుఖఃశాంతులతో ఉండాలని ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి సతీమణి కవితమ్మ కోరారు. మండల కేంద్రానికి సమీపంలోని వారపుసంత తోపులో వెలసిన కోటకొండ గంగమ్మ ఆలయంలో బుధవారం వైభవంగా తిరునాల సాగింది. ఎమ్మెల్యే సతీమణి కవితమ్మ స్వగృహం నుంచి జ్యోతులు, దీలు, బోనాలు, పట్టు వస్త్రాలను సంప్రదాయబద్ధంగా ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళలు భక్తిశ్రద్ధలతో ఉపవాసంతో దీలు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి విద్యుత్ దీపాలతో అలంకరించిన చాందినీబండ్ల మెరవని సాగింది. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరింపజేశాయి.


పట్టు వస్త్రాలు, జ్యోతులు ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు

కలెక్టర్ ఆగ్రహంతో కదిలిన అధికార యంత్రాంగం

బి.కొత్తకోట: బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని కురవానికమంట జగనన్న కాలనీలో వసతుల కల్పన, ఇళ్ల నిర్మాణాల జాప్యంపై అధికారుల్లో కదలిక వచ్చింది. బుధవారం అధికారులు కాలనీలో తిష్టవేసి పనులు చేయిస్తున్నారు. గత శనివారం కలెక్టర్ గిరీషా కాలనీలో ఇళ్ల నిర్మాణాలపై ఆకస్మిక తనిఖీ చేసి ఇక్కడి పరిస్థితులపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే చర్యలు చేపట్టకపోతే సస్పెండ్ చేస్తానంటూ హెచ్చరించారు. దీనిపై మదనపల్లె డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి లక్ష్మీపతి క్షేత్రస్థాయిలో శాఖల అధికారులను సమన్వయం చేస్తూ పనులకు శ్రీకారం చుట్టారు. ఇక్కడ 502 మంది నిరుపేదలకు ఇళ్లస్థలాలను మంజూరు చేశారు. 176 మంది ఇళ్లనిర్మాణాలు చేపట్టగా మిగిలిన లబ్ధిదారులు పనులకు దూరంగా ఉన్నారు. దీనితో డీఎల్‌డీఓ లక్ష్మీపతి, హౌసింగ్ డీఈ శ్రీహరిరావు, మేనేజర్ బి.రమాదేవి, డిజిటల్ అసిస్టెంట్ జియా, కోఆప్షన్ సభ్యులు నాసిర్, సిబ్బంది బుధవారం కాలనీలో నిర్మాణాలు చేసుకుంటున్న ప్రతి లబ్ధిదారుని వద్దకు వెళ్లి పనులు సత్వరమే పూర్తి చేయించాలని కోరారు. కాలనీలో ఇంటర్నల్ మట్టి రోడ్ల నిర్మాణాలు, నీటి సరఫరా పైప్‌లైన్ ఏర్పాటు, అప్రోచ్‌రోడ్డు పనులు ప్రారంభించారు. కాలనీలో మధ్యలోని కాలువపై కల్వర్టుల నిర్మాణ పనులు మొదలు పెట్టారు. కాలనీలో పచ్చదనం కోసం మొక్కలు నాటించనున్నట్టు లక్ష్మీపతి చెప్పారు. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులకు నోటీసులు జారీ చేస్తున్నట్టు చెప్పారు. 10-15 రోజుల్లో అన్ని ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు తీసుకొంటామని చెప్పారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ ఏఈలు, డిజిటల్ అసిస్టెంట్లు, వలంటీర్లు, వర్క్ఇన్స్‌పెక్టర్లతో లక్ష్మీపతి, శ్రీహరిరావు, సమావేశం నిర్వహించారు.

కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి


కార్మికులకు అవగాహన కల్పిస్తున్న సహాయ కమిషనర్ పద్మావతి

నందలూరు (రాజంపేట): కార్మికుల పట్ల యాజమాన్యాలు జాగ్రత్తలు వహిస్తూ వారికి అందుబాటులో ఉండాలని కార్మికశాఖ సహాయ కమిషనర్ పద్మావతి పేర్కొన్నారు. బుధవారం రాజంపేటలో కార్మికులతో మాట్లాడుతూ రోజు రోజుకు పెరుగుతున్న అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇందు కోసం యాజమాన్యాలు కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. పని ప్రదేశంలో తాగునీరు, మజ్జిగ, ఇతర శీతల పానీయాలు, ఓఆర్ఎస్ పాకెట్లు, ఔషధాలు అందుబాటులో ఉంచాలన్నారు.

పంచాయతీ అభివృద్ధికి కృషి

ఓబులవారిపల్లె : ముక్కవారిపల్లె పంచాయతీని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాలా కృషి చేస్తామని సర్పంచ్ అరవ శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం పంచాయతీ బాట కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ప్రజలు తమ సమస్యలను 9993351116 ఫోన్ నంబర్‌కు తెలియజేస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

20న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

కాశినాయన : నరసాపురం గ్రామంలో శ్రీపోలేరమ్మ తిరునాల సందర్భంగా ఈ నెల 20వ తేదీన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండవ బహుమతిగా రూ.75 వేలు, మూడవ బహుమతిగా రూ.50 వేలు, నాల్గవ బహుమతి రూ.40 వేలు, ఐదవ బహుమతి రూ.30 వేలు, ఆరవ బహుమతి రూ.20 వేలు పోటీల్లో గెలుపొందిన వృషభాలకు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. 20వ తేదీ ఉదయం 7 గంటల లోపు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 8384106188 నెంబరును సంప్రదించాలని కోరారు.

చిన్నమండెం జెడ్పీ హైస్కూలు హెడ్మాస్టర్ సస్పెన్షన్

చిన్నమండెం : నాడు-నేడు పనుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు చిన్నమండెం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ జయచంద్రారెడ్డిపై ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డి సస్పెన్షన్ వేటు వేశారు. వివరాలిలా.. చిన్నమండెం మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నాడు - నేడు కింద రూ.1.20 కోట్ల అంచనాతో పనులను ప్రారంభించారు. అందులో రూ.18లక్షలు ప్రధానోపాధ్యాయుడు జయచంద్రారెడ్డి ఖాతాలో జమ అయ్యాయి. అయినా పనులు మాత్రం పునాదుల దశలోనే ఉన్నాయి. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. హెడ్మాస్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ఆర్‌జేడీ సస్పెండ్ చేశారు.

ఏపీఆర్ మైనార్టీ గురుకుల కళాశాల అడ్మిషన్లు ప్రారంభం

వాల్మీకిపురం : స్థానిక తరిగొండ రోడ్డులోని ఏపీఆర్ మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపల్ రమామంజుల తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో 32, బైపీసీ గ్రూపులో 32, సీఈసీ గ్రూపులో 28 ఖాళీ సీట్లు ఉన్నాయన్నారు. 2022-23 విద్యా సంవత్సరంలో ఎస్ఎస్‌సి పరీక్షలో అర్హత సాధించిన వారు మాత్రమే అర్హులన్నారు. ఉచిత విద్య, ఉచిత వసతి, ఉచిత భోజనం సదుపాయంతో పాటు ఇంగ్లీష్ మీడియం విద్య బోధన, డిజిటల్ తరగతుల నిర్వహణ ఉంటుందన్నారు. ఫస్ట్ ల్యాంగ్వేజ్ ఉర్దూ బోధించడం జరుగుతుందన్నారు. అర్హులైన మైనార్టీ విద్యార్థులు ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు ఫారాలను డౌన్‌లోడ్ చేసుకొని, జూన్ 7వ తేదిలోగా కళాశాలలో అందించాలని, లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా కూడా పంపవచ్చునన్నారు. వివరాలకు 8008304066ను సంప్రదించాలన్నారు.

రాయచోటి నుంచి ఆర్టీసీ సమ్మర్ స్పెషల్ బస్సులు

రాయచోటి అర్బన్ : వేసవి సెలవులను పురస్కరించుకుని రాయచోటి నుంచి సమ్మర్ స్పెషల్ టూర్‌లకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం ధనుంజయ తెలిపారు. బస్సుల వివరాలు ఇలా..

- రాయచోటి నుంచి తిరువణ్ణామలైకు భక్తుల సౌకర్యం కోసం ప్రతి పౌర్ణమి రోజున అల్ట్రా డీలక్స్ బస్సు సర్వీసును నడుపుతున్నామన్నారు. రాను, పోను చార్జీలు పెద్దలకు రూ. 875, పిల్లలకు రూ. 500 ఉందన్నారు.
- జూన్ 3వతేదీన కాణిపాకం, గోల్డెన్ టెంపుల్‌లకు ప్రత్యేక బస్సు సర్వీసును నడుపుతున్నామన్నారు. రాయచోటి నుంచి ఊటీకి వెళ్లే ప్రయాణికులకు సూపర్‌లగ్జరీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు.
- మైసూర్ ప్యాలెస్, చాముండేశ్వరి టెంపుల్, జూపార్క్, బృందావన్ గార్డెన్, హార్సిలీహిల్స్ 3రోజుల ప్రత్యేక యాత్ర బస్సుసర్వీసును కూడా నడుపుతున్నట్లు తెలిపారు. పెద్దలకు చార్జీ రాను పోను రూ. 3వేలు, పిల్లలకు రూ.1700 వసూలు చేస్తున్నట్లు తెలిపారు.
- 4రోజుల యాత్రలో భాగంగా రాయచోటి నుంచి షిరిడీ సాయినాథుడిని దర్శించుకునే భక్తుల కోసం హైదరాబాద్, తుల్జాపూర్, శనిశింగనాపూర్, షిర్డీలకు సూపర్ లగ్జరీ బస్సును నడుపుతున్నామన్నారు. రాను పోను పెద్దలకు టికెట్ రూ.4,800, పిల్లలకు రూ.3500 గా నిర్ణయించామన్నారు.
- 3 రోజుల యాత్రలో భాగంగా రాయచోటి నుంచి వేలాంగిణి, నాగూరు పుణ్యక్షేత్రాల సందర్శన కోసం ప్రత్యేక బస్సును నడుపుతున్నట్లు తెలిపారు. లగ్జరీ బస్సును అరక్కోణం, కంచి, మైలాదురై, చిదంబరం, నాగపట్నం, వేళాంగిణి, నాగూరు దర్గాలకు నడుపుతున్నామన్నారు. రానుపోను చార్జీలు పెద్దలకు రూ.2100, పిల్లలకు రూ.1100 చొప్పున నిర్ణయించామన్నారు.

వేసవి విహారయాత్రలు, పుణ్యక్షేత్రాలకు వెళ్లేలనుకున్నవారు ఈ ప్రత్యేక యాత్రల బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయండి

రాయచోటిటౌన్ : ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారిని కాపాడాలని రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా అన్నారు. బుధవారం రాయచోటిలో డాక్టర్ అబ్దుల్ కలాం యువ ట్రస్టు డైరెక్టర్ వినయ్ కుమార్ పుట్టిన రోజు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఆరోగ్యవంతులుగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహేశ్వర రాజు, రేష్మా మాస్టర్, వి. మహేష్, ఫాటన్ మురళి, షాజహాన్, మనోహర్, హుస్సేన్, ఫాయద్ సాయి తదితరులు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ మహబూబ్ బాషా తదితరులు

ఏరియా ఆసుపత్రిలో అవుట్ పోస్టు ఏర్పాటు చేయండి

రాజంపేట రూరల్ : ఏరియా ఆసుపత్రిలో ప్రజల సౌకర్యం కోసం అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలని డీఎస్పీ చైతన్యను డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎస్. చెన్నకృష్ణ కోరారు. స్థానిక డీఎస్పీ కార్యాలయం వైద్య బృందం మర్యాద పూర్వకంగా డీఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.వెంకట నాగేశ్వరరాజు, తాలూకా ప్రభుత్వ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు యు. సిద్దిరామయ్య, డీఈఓ నీరజ తదితరులు పాల్గొన్నారు.


డీఎస్పీ చైతన్యకు వినతిపత్రం అందజేస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ చెన్నకృష్ణ

రైతుల అభిప్రాయం మేరకే నష్ట పరిహారం

లక్కిరెడ్డిపల్లి : కాలేటీ వాగు లిఫ్ట్ ఇరిగేషన్‌లో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు రైతుల అభిప్రాయం మేరకే నష్టపరిహారం చెల్లిస్తామని ఆర్డీఓ రంగస్వామి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో కుర్నూతుల, మద్దిరేవుల, దిన్నెపాడు, దప్పేపల్లె, కస్తూరిరాజుగారిపల్లె గ్రామాలకు చెందిన రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు కాకుండా రైతుల అభిప్రాయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిహారం చెల్లించే విషయంలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయ్ శంకర్ రాజు, సర్వేయర్ కరీముల్లా, ఆర్ఐ సమ్మత్ ఖాన్, వీఆర్ఓలు, రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రంగస్వామి

బిందు సేద్య పరికరాల తనిఖీ

పుల్లంపేట : అన్నమయ్య జిల్లా సూక్ష్మ నీటి సాగు పథకం అధికారి ఎం.వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం పుల్లంపేట మండలం అనంతసముద్రం పరిధిలోని ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా రాయితీపై రైతులకు ఇచ్చిన బిందుసేద్య పరికరాలను తనిఖీ చేశారు. అలాగే రైతులకు బిందు సేద్యం ద్వారా ఎరువుల వినియోగంపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కొత్తగా బిందు, తుంపర సేద్య పరికరాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఐడీసీ చంద్రశేఖర్, ఎంఐఏఓ నజీర్, కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



బిందు సేద్య పరికరాలను తనిఖీ చేస్తున్న జిల్లా సూక్ష్మ సాగునీటి పథకం అధికారి

మహిళా రెజ్లర్ల న్యాయ పోరాటానికి మద్దతు

మదనపల్లె : అంతర్జాతీయ క్రీడావేదికలైన ఒలింపిక్స్, కామన్‌వెల్త్, ఏషియన్‌గేమ్స్ పోటీలలో పతకాలను సాధించి భారతదేశ కీర్తిప్రతిష్టలను ప్రపంచానికి చాటిచెప్పిన మహిళా మల్లయోధులు (రెజ్లర్స్)పై లైంగిక వేధింపులకు పాల్పడిన డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షులు ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. మహిళా రెజ్లర్లకు మద్దతుగా బుధవారం స్థానిక సంతగేటు ఏఐటీయూసీ కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ.. కంచె చేను మేసినట్లు రక్షకుడే తమపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని 2016లో మహిళా రెజ్లర్లు రిపోర్ట్ చేసినా చర్యలు లేవన్నారు. రెజ్లర్స్ అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించినప్పుడు వారిని ఇంటికి పిలిపించుకుని ఫోటోలు తీయించుకుని గొప్పలు చెప్పుకునే ప్రధాని మోదీ ఇప్పుడు వారి గోడును పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పనిప్రదేశాల్లో, ఫ్యాక్టరీల్లో, ఆఫీసుల్లో ప్రతిచోటా మహిళలపై అధికారులు లైంగిక వేధింపులకు పాల్పడుతూనే ఉన్నారన్నారు. మహిళలపై అత్యాచారాలకు, హత్యలకు ఒడిగడుతున్న నిందితులను కాపాడుతున్న కేంద్రప్రభుత్వ వైఖరిని ఖండించారు.

నాడు - నేడు పనుల తనిఖీ

నిమ్మనపల్లె : నాడు-నేడు రెండో విడత పనులను జిల్లా ఐసీడీయస్ ఇన్‌చార్జి పీడీ ధనలక్ష్మి బుధవారం తనిఖీ చేశారు. మండలంలోని రాచవేటివారిపల్లె పంచాయతీలోని బొంతవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రం రెండో విడత నాడు - నేడు పనులకు ఎంపికైంది. అక్కడ జరుగుతున్న భవన నిర్మాణ పనులను పీడీ, మదనపల్లె సీడీపీవో సుజాతతో కలిసి తనిఖీ చేశారు. పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాచవేటివారిపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడ పిల్లలు, బాలింతలు, గర్భిణులకు అందుతున్న పోషకాహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి ఆరోగ్య స్థితిపై అంగన్‌వాడీ కార్యకర్తను ప్రశ్నించారు. బాలింతలు, గర్భిణులతో మాట్లాడారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైఎస్సార్ పోషణ కిట్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలింతలు సరైన పోషకాహారం తీసుకోవాలన్నారు. పిల్లలు బరువు తక్కువ కాకుండా అంగన్‌వాడీ కార్యకర్తలు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రహ్మణ్యం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భానులక్ష్మీదేవి, హెల్పర్ హసీనా తదితరులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి పీడీ ధనలక్ష్మి

మెరుగైన సేవలు అందించాలి

సచివాలయ సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) ధనలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని రాచవేటివారిపల్లె సచివాలయం, సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీవో లీలా మాధవితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు పట్టికను పరిశీలించారు. సచివాలయం పరిధిలో జరుగుతున్న లావాదేవీలపై డిజిటల్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. వేసవిని జాగ్రత్తలను ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా.? అంటూ ఏఎస్ఎంను ప్రశ్నించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్‌లను వారి విధులకు సంబంధించి ప్రశ్నించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది కార్యదర్శికి సహాయ సహకారాలు అందించాలన్నారు. సచివాలయానికి వచ్చే ప్రజలతో మర్యాద పూర్వకంగా నడుచుకోవాలన్నారు. సిబ్బంది సమయపాలన, డ్రెస్‌కోడ్ తప్పనిసరిగా పాటించాలన్నారు. స్పందన కార్యక్రమాన్ని ప్రతిరోజూ నిర్వహించాలన్నారు. డిజిటల్ లావాదేవీల సంఖ్య పెంచాలన్నారు. అనంతరం సిబ్బందితో కలిసి సంపద తయారీ కేంద్రంలో చెత్త తొట్టెలను పరిశీలించారు.